


-గండ్రేటి పెంటయ్య

ఐదయ్యేందుకు- మరో అరగంట వ్యవధి మిగిలి ఉంది.

వసంతరావుకా అరగంట అతి కష్టంగా తోచింది. ఆ రోజందుకున్న నూటయాభయి రూపాయలను చేర వలసిన చోటుకి చేర్పిస్తే గాని వసంతరావుకి మనసు స్థిమితంగా ఉండదు.

చిక్కనయిన చుక్కనువేసి, చక్కనయిన చుక్కనుజూసి ఏ తెల్ల వారు జాముకో యింటికి జేరి, 'అబ్బా! రాత్రంతా మేలుకుంటేనే గాని వెధవ రిపోర్టు పూర్తికాలా' అని ఏ ప్రోగ్రెస్ రిపోర్టునో ఉద్దేశించి అంటూ పక్కమీద వాలి పోతాడు. తొమ్మిదికి లేచి ఆదర బాదరాగా అన్ని పనులు కానిచ్చి, పరుగులాంటి నడకతో ఆఫీసుకు హాజరవుతాడు.

వసంతరావు నెలకు నూటయాభయి రూపాయల విలువగల మందుల బిల్లులను ఆఫీసులో మార్చి తీసుకుంటాడు. ఆ సంగతిని అమాయకురాలయిన శైలజకు తెలియనివ్వడు. అందుకున్న డబ్బుని అదేదార్న జల్సాగా ఖర్చు చేసి వట్టి జేబుల్తో మర్నాడుదయానికి యింటికి చేరుకుంటాడు.

ఆఫీసులో అంతా ఏ నెలా ఖిరవయి, ముప్ఫయి రూపాయల్ని మించి మందుల బిల్లులను మార్చుకున్న రికార్డులేదు. కాని వసంతరావు మాత్రం నెలనెలా నూటయాభయికి తగ్గకుండా తీసుకోవడం అందరికీ లోన పీకుతూనే ఉన్నది.

గడియారం ఐదుగంటలు కొట్టేసరికి ఎక్కడి పనులక్కడ వదిలి లేచినిలబడ్డాడు వసంతరావు. అతణ్ణే గమనిస్తూ కూర్చున్న ముత్యాలరావు, గణపతి, రాఘవులు అంతా వసంతరావుని చుట్టుముట్టారు.

"మందులు కొన్నానంటూ నెల నెలా నూటయాభయి లెక్క న కొట్టేస్తున్నావు. ఏ సారీ నిన్నేం అడగలేదు. ఈ సారన్నా మాకు మందు పార్టీ యిచ్చుకు తీరవలసిందే" నంటూ పేచీ పెట్టారు. వసంతరావు మీమాంసలో పడ్డాడు. ఒప్పుకునేవరకు వాళ్లొదిలిపెట్టలేదు.

నలుగురు కలిసే ఆఫీసునుండి బయలుదేరారు.

నలుగురూ రెండవ రౌండ్‌కి గ్లాసులు నింపుకున్నారు.

"ఇంతకూ మీ ఆవిడకున్న జబ్బేంటి?" అడిగాడు ముత్యాలరావు.

చెప్పాడు బిల్లుపేసే రాఘవులు.

"మైగాడ్! అదొక శాపం!" పిటీ చూపించాడు ముత్యాలరావు.

మూడ్‌లోకొచ్చిన వసంతరావు యింకా గట్టిగా నవ్వాడు.

"మీరంతా ఒట్టి అమాయకులు. లోకం పోకడ తెలీని మనుషులు."

ఆశ్చర్యంగా చూశారంతా వసంతరావు వంక.

"మా స్నేహితుడొకడు గవర్నమెంటాస్పత్రిలో డాక్టరు. మా యిద్దరి స్నేహం ఎట్లాంటిదంటే, నే నెక్కడ సంతకం

పెట్టమంటే కళ్ళు మూసుకొని మరీ పెట్టేస్తాడు. ఇక బిల్లుల విషయంలో నంటారా- అదంతా వేరే పద్ధతుంది. మా ఆవిడ నాకన్నా ఆరోగ్యవంతురాలు" అంటూ గ్లాసుని టేబిల్‌పై ఉంచాడు.

అందరికీ అర్థమయ్యింది వసంతరావు చేస్తున్న పనేమిటో. కాని బిల్లుల విషయంలో అతను చూపిస్తున్న నేర్పేమిటో బోధపడ లేదు.

బిల్లువేసే రాఘవులికి కొంత అర్థమయినట్టనిపించింది. ఎందు కంటే వసంతరావిచ్చే బిల్లులన్నీ యీ వూళ్ళో ఏ మందుల షాపుకి చెందనివి. ఏమని అడిగితే అత్త వారు కొని పంపిస్తున్నారనటం జ్ఞాపకాని కొచ్చింది. అత్తారూర్లో మామగారి పరపతిపై, మందులు కొనకుండానే కాష్ మెమోలను సంపాదిస్తున్నాడని మాత్రం అర్థ మయింది.

నిజానికి వసంతరావు బావ మరిది ఒక మందుల షాపులో పని చేస్తుండేవాడు. ఆ దుకాణం మూత పడిపోయిందీ మధ్య. ఆ దుకాణపు మిగిలిపోయిన కాష్ మెమోలు బావమరిది వద్ద పడిఉంటే, వసంత రావు తెచ్చుకొనివాడుకుంటున్నాడు- ఎవడు చూడొచ్చాడన్న నమ్మ కంతో.

అంతా వసంతరావుని మెచ్చు కున్నారు.

మరో రౌండు ముగించి లేచి నిలబడ్డారంతా. ఒకే ఐటమ్‌తో మాటయాభై చెల్లిపోగా, తర్వాత ఐటమ్‌ని ఈసారికి మానుకుని ఇంటికిపోయాడు వసంతరావు.

కాలచక్రం క్రమం తప్పక తిరుగుతున్నది. కాని క్రమాన్ని తప్పుదున్నదల్లా మనిషికున్న బుద్ధొక్కటే. మందులు కొన్నా నంటూ మాయచేసి అక్రమంగా ఆఫీసునుండి డబ్బు తీసుకోవటం అతడి హక్కులా ఉండిపోయింది వసంతరావుకి.

ఆ వేళ వసంతరావు మామూలు టైముకే ఇంటికి చేరుకున్నాడు. తాళం వేసి ఉంది. అమ్మ ఆస్పత్రి కెళ్ళిందని ఆడుకుంటున్న బుజ్జి బ్బాయి చెప్పాడు. అప్పటిగ్గాని అతడికి తట్టలేదు- శైలజ రోజు రోజుకి నీరసించిపోతున్నదని. హఠాత్తుగా ఆమె ఆరోగ్యం క్షీణించిపోయింది. పనిపాట్లు చేసుకోగల్గుతున్నది గదాని తనూ అంతగా పట్టించుకోవటం మానే శాడు.

శైలజ వచ్చేవరకు కొడుకు తోనే గడిపేశాడు.

రిక్షా దిగింది శైలజ. ఆమె చీపురు పుల్లలా మారిపోతున్న

దెందుకో అర్థం కాలేదు వసంత రావుకి.

"కాళ్ళూ చేతులు తేలిపోతున్న ట్లుంటేను డాక్టరమ్మ దగ్గరికెళ్ళాను. రక్తం, యూరిను చూపించుకు రమ్మన్నారు. ప్రొద్దుట మళ్ళీ వెళ్ళాలి" అంది శైలజ తాళం తీస్తూ.

"అలాగా! రేపు మళ్ళీ వెళ్ళ యితే" అన్నాడు లోని కడుగు పెడుతూ.

మర్నాడుదయం రక్తం, యూరిన్ ఇచ్చి వచ్చింది.

సాయంత్రం మళ్ళీ వెళ్ళి డాక్టర్ని కలిసి, కావలసిన మందులు వ్రాయించుకొని, తీసుకోవలసిన జాగ్రత్తలు తెలుసుకొని బయట పడింది. అప్పుడే ఆఫీసునుండి తిన్నగా అక్కడికి చేరిన భర్తతో రిక్షా ఎక్కింది.

రిక్షా బీచ్ రోడ్డుమీద నడుస్తు న్నది.

చల్లగాలి నిష్పక్షపాతంగా అందర్నీ తాకుతుంటూ ముందుకి పోతున్నది.

"ఏమంది మీ డాక్టరమ్మ?" తీరిగ్గా అడిగాడు వసంతరావు.

"తిండి విషయంలో కంట్రోలుండాలట. తీసుకోవలసిన ఆహారం విషయం ఈ పుస్తకంలో వ్రాసి ఉందట. చదివి తెలుసుకో మని గుర్తుపెట్టింది. పాలు, గ్రుడ్లు విధిగా వాడమంది. వారానికో మారు యూరిన్ చూపించుకోమంది. ఉదయం, సాయంత్రం భోజనానికి ముందు ఈ కాప్సూల్స్ వాడమంది. భోజనం తర్వాత ఈ టానిక్కు రెండేసి చెమ్చాలు తాగమంది. నెలంతా గడవటమే గగనమైపోతు న్నది. అట్లాంటిదీ, యీ మందు మాకులకోసం ఎంత తగలేయ్యాలో ఏమిటోనని, నెలక్కాబోయే మందుల ఖర్చుని అంచనా వేసి చెప్పమన్నాను. మందులు, టానిక్కులు, ఠయిటు అన్నీ కలిపి మూడు వందలు కావచ్చునన్నా రామె. 'ఇలా ఎన్నాళ్ళ వరకు వాడ వలసి ఉంటుందో ఇప్పటిలో చెప్పలేం. చాలాకాలం వాడవలసి ఉంటుంది. మీవారెలాగు గవర్న మెంటు సర్వీసులో ఉన్నారు కాబట్టి, మందుల్లో కొన్నింటి ఖర్చుని మీ వారు తిరిగి పొందగలరు. నూరు నూటయాభయి వరకు దొరక్క మానవు' అన్నారామె." ఆమె మాటలు వింటూన్న వసంతరావు తల తిరగటం ఆరంభించింది.

"ఏదీ, ఆ కాగితమిలాతే!" అని ప్రిస్క్రిప్షన్ని తీసుకుని చూశాడు.

అంతే!

ప్రక్కలో బాంబు పేలినట్టు అదిరిపడ్డాడు వసంతరావు. నెలల తరబడి తను వ్రాయించుకొస్తున్న దొంగ ప్రిస్క్రిప్షన్లు 'హలో, డియర్' అన్నట్టు పలకరించాయి. ఇప్పటి ప్రిస్క్రిప్షన్‌లోని విడివిడి అక్షరాలు వెక్కిరించాయి.

"శైలజ-డయబిటీస్ అండ్ బి. పి." గొణుక్కుంటున్నట్టు చదువుకున్నాడు.

తను వ్రాయిస్తున్న జబ్బు పేరు అదే! తన భార్య కొచ్చింది అదే!!

"నేనేం పాపం చేశానో నాకీ శిక్ష!" అని విచారిస్తున్న శైలజ కళ్ళలోకి సూటిగా చూడలేక తల దించుకున్నాడు- చేసిన పాపం కళ్ళెదుటకు రాగా, వసంతరావు.

చైను జారిపోవటంతో బీచ్ ఒడ్డున నిలబడిపోయింది రిక్షా.

బీచ్‌లో ఒక బిచ్చగత్తె గుడ్డివాడి చెయ్యిని పట్టుకొని ముందుకు నడిపిస్తున్నది. అలవాటయిన డైలాగుల్ని అదే పనిగా వదుల్తున్నాడు గుడ్డివాడు. వయసులో వున్న పెళ్ళాన్ని చూసి ఒక్కొక్క పైసా వేస్తున్నారు అక్కడి వాళ్ళు. కొంత దూరంలో ఒక పర్సు పడి ఉంది. బిచ్చగత్తె ధ్యాస వచ్చే పోయే వారిపై ఉంది. పర్సు సంగతి పట్టించుకోలేక పోయింది. చుట్టూ తలనొకమారు తిప్పి, పర్సందుకున్నాడు గుడ్డివాడు. పెళ్ళాం చెవిలో మెల్లిగా గొణిగాడు. వడి వడివడిగా అడుగులేసుకుంటు ఇద్దరూ జారుకున్నారు.

సంగతిని భర్తకు వివరించి శైలజ అంది- "కళ్ళుండి లేవని చెప్పుకుంటూ మోసగిస్తున్న ఇలాంటి వెధవలకు దేవుడు ఏదో నాడు నిజంగానే కళ్ళు తీసేస్తాడు."

మౌనంగా ఉండిపోయాడు వసంతరావు. *


విజయ

మార్చి సంచికలో ప్రారంభం!

క్రొత్త చారిత్రాత్మక సీరియల్!

ప్రసాద్ రచన

వివరాలు వచ్చే సంచికలో!